బీపఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, మే 28 : బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు జిల్లాలోని అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,5వ తరగతుల్లో ప్రవేశాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని జూన్ 7వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉటుందన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించొద్దని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలో అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రేపు రామప్ప భూముల కౌలు వేలం

వెంకటాపూర్, మే 28 : రామప్ప దేవాలయం భూములు వర్షాకాలం పంటకు కౌలు వేలం పాటలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవిందరావుపేట పరిధిలోని 10.14 ఎకరాలకు రూ.50 వేలు ధరావత్తు సొమ్ము చెల్లించాలని, బుద్దారం గ్రామ పరిధిలోని 27 గుంటలకు రూ.5 వేలు, పాలంపేట పరిధిలో 3.20 ఎకరాలకు రూ.30 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈవో సూచించారు.

సత్వర న్యాయానికి కృషి చేయాలి

ములుగు ఎస్పీ పీ శబరీష్

మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగు, మే 28 (నమస్తే తెలంగాణ) : పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించగా స్టేషన్ల వారీగా పోలీస్ అధికారులతో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. వానకాలం సందర్భంగా వరద ముంపును ఎదుర్కునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్ విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల వెంట అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలు, ఇసుక లారీలపై కేసులు నమోదు చేయాలన్నారు. వేటగాళ్లు పంట పొలాలు, అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చకుండా చూడాలని తెలిపారు. నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను అమర్చాలన్నారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు శ్రీధర్, రంజిత్‌కుమార్, రాజు, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్, చల్లా రాజు, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, సురేశ్, రమేశ్, రవికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని జీపీ కార్మికుడి మృతి

సారయ్య (ఫైల్)

ములుగు రూరల్, మే 28 : లారీ ఢీకొని జీపీ కార్మికుడు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ములుగుకు చెందిన జీపీ కార్మికుడు బల్నూరి సారయ్య (58) మరో నలుగురు కార్మికులతో కలిసి జాతీయ రహదారి డివైడర్ వద్ద చెత్తను తొలగిస్తున్నాడు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న లారీ సారయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా తోటి కార్మికులు ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మంగపేట, మే 28 : హేమాచల లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం నిర్వహించిన వసంతోత్సవంతో ముగిశాయి. వేడుకల్లో ప్రధాన ఘట్టాలైన కల్యాణం, నాగవెల్లి వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చివరి రోజు అర్చక బృందం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను గర్భగుడి, యాగశాల, వేణుగోపాల స్వామి ఆలయాల మీదుగా తీసుకొచ్చి, పట్టు వస్త్రాలతో అలంకరించి సంప్రదాయ పూజలు చేశారు. దేవతామూర్తులను సతీసమేతంగా గజవాహనంపై ఆసీనులను జేసి పసుపు, కుంకుమలతో రంగులు చల్లారు. భక్తులు, ఆలయ సిబ్బంది ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ గుట్టపై ప్రధాన వీధిలో ఊరేగించారు. వేడుకల్లో ఆలయ ఇన్‌చార్జి ఈవో మహేశ్, మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, స్థానిక ప్రధాన అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, ముక్కామల రాజశేఖర్‌శర్మ, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు మురళీకృష్ణ మాచార్యుల బృందం, పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, వెంకటనారాయణశర్మ, సీతారాములు, సుధీర్, గణేశ్, పుల్లయ్య, అజయ్, నరేశ్ పాల్గొన్నారు.

మహిళ లకు ఆటల పోటీలు

భూపాలపల్లి రూరల్, మే 28 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు భూపాలపల్లి సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆటలుపై సింగరేణి సేవా సమితి సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. సింగరేణి ఇల్లందు క్లబ్‌హౌస్, 1000 క్వార్టర్స్, కృష్ణకాలనీ అంబేద్కర్ స్టేడియంలో 30వ తేదీ ఉదయం 9 గంటలకు టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, బాంబ్ ఇన్ సిటీ గేమ్స్, పరుగు పందెం ఆటలు ప్రారంభం అవుతాయన్నారు. గెలుపొందిన వారికి జూన్ 2న రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించనున్న వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రగళ్లపల్లి గ్రామంలో తునికాకు కట్టలు కడుతున్న మహిళలు

కల్లంలో ఆరబెడుతున్న తునికాకు కట్టలు

జోరుగా తునికాకు సేకరణ

- వాజేడు ఏజెన్సీలో ప్రారంభం
- ఈ సారి తగ్గిన కల్లాల సంఖ్య
- సేకరణ అంతంత మాత్రమే
- 50 ఆకుల కట్టకు రూ. 3

వాజేడు, మే 28 : గిరిజనులు ప్రకృతి ప్రసాదంగా భావించే తునికాకు సేకరణ వాజేడు ఏజెన్సీలో జోరుగా నడుస్తున్నది. వయసుతో సంబంధంలేకుండా ప్రతి ఒక్కరూ ఆకు సేకరణలో నిమగ్నమయ్యారు. సుమారు నెల రోజుల పాటు వారికి ఉపాధి లభించనున్నది. ప్రూనింగ్ చేసిన చెట్ల నుంచి తునికాకులను సేకరించి ఉదయం తొమ్మిది గంటలలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. తర్వాత ఇంటి వద్ద నీడకు కూర్చొని ఆకులను కట్టలుగా కడుతున్నారు. 50 ఆకుల కట్టకు ప్రభుత్వం రూ.3 చెల్లిస్తుండడంతో ఆకు సేకరణకు మరింత పోటీ ఏర్పడింది. ములుగు డివిజన్ ఏజెన్సీ మండలాలైన వాజేడు, వెంకటాపురం, గోవిందరావుపేట, తాడ్వా యి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో ప్రతి సంవత్సరం అటవీశాఖ, వ్యాపారుల ఆధ్వర్యంలో తునికాకు సేకరణను నిర్వహిస్తుంది. అయితే ఈ సంవత్సరం కొంత ఆలస్యంగా మే రెండో వారంలో తునికాకు సేకరణ పనులను ప్రారంభించారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని వెంకటాపురం, ఆలుబాక, చీకుపల్లి, పేరూరు నాలుగు యూనిట్ల పరిధిలో ప్రజలు ఆకు సేకరణలో నిమగ్నమయ్యారు. సేకరించిన ఆకును 50 ఆకుల కట్టలుగా కట్టి తునికాకు కల్లాల్లోకి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈసారి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ వెంటనే చెల్లించాలని సేకరణదారులు కోరుతున్నారు. కట్టకు రూ.3 చెల్లించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. గతంకంటే ఈసారి కల్లాలు తగ్గడంతో లక్ష్యం తగ్గినట్టు ఎఫ్ఆర్వో తెలిపారు.

బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ

తునికాకు సేకరణదారులకు గతంలో గ్రామాల్లో ఉన్న కల్లాల ద్వారానే నగదు పంపిణీ చేసేవారు. గడిచిన రెండేళ్లగా నగదును ఆకు సేకరణదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు వాజేడు మండల ఎఫ్ఆర్వో చంద్రమౌళి తెలిపారు. అలాగే బోనస్ సైతం వారి ఖాతాల్లోనే జమచేస్తామని, దీని వల్ల సేకరణదారులకు నగదు చెల్లింపుల్లో మధ్యవర్తుల ప్రమేయం, ఇబ్బందులు ఉండవని తెలిపారు.

900 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం

వాజేడు మండలంలో ఈసారి రెండు యూనిట్లకు గాను ప్రస్తుతం పేరూరు యూనిట్ పరిధిలోని తక్కువ కల్లాల్లో కోతలు ఉన్నందున 900 తునికాకు స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెట్టుకున్నాం. ఈ నెల రెండో వారం నుంచి తునికాకు సేకరణ పనులు ప్రారంభమయ్యాయి. సేకరణదారులు బ్యాంకు ఖాతాల నంబర్లు ఇస్తే నగదు జమ చేస్తాం. బోనస్ సైతం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.

– చంద్రమౌళి, వాజేడు ఎఫ్ఆర్వో

తునికాకు కట్టకు ధర పెంచాలి

పెరిగిన ధరలకనుగుణం తునికాకు 50 ఆకుల కట్టకు రూ.5 ఇవ్వాలి. అటవీశాఖ అధికారులు పోయిన సంవత్సరం మూడు రూపాయలే ఇప్పుడూ ఇస్తున్నారు. బోనస్ డబ్బులు ఎప్పటికప్పుడు మా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.

– చింత శ్రీరాములు, ప్రగళ్లపల్లి

నేడు వాహనాల వేలం

ములుగురూరల్, మే 28 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ సుధీర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 11గంటలకు కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో శాంతి పూజలు

ఏటూరునాగారం, మే 28 : మండలంలోని భూటారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం శాంతిపూజలు నిర్వహించారు. గత నెల 28న అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీల కేంద్రంలోనే చనిపోయిన విషయం తెలిసిందే. నెల రోజులైనా కొందరు పిల్లలు కేంద్రానికి వెళ్లడానికి భయపడుతుండడంతో మంగళవారం కేంద్రంలో అర్చకులతో శాంతి పూజలు నిర్వహించారు. దీంతో కేంద్రంపై ఉన్న అపోహలు గ్రామస్తులకు తొలగిపోయాయి. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ కమిటీ నిర్వాహకుడు వహీద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

ములుగురూరల్, మే 28 : ములుగు మండలం అబ్బాపురంలోని నర్సరీలను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జీ అనసూయ మంగళవారం సందర్శించారు. నర్సరీ యజమానులు నర్సరీ యాక్టు మార్గదర్శకాల ప్రకారం అన్ని రికార్డులను నిర్వహించాలని తెలిపారు. రైతులు లైసెన్స్ ఉన్న నర్సరీలోనే నారు కొనాలని సూచించారు. 45 రోజు లోపు మిరప నారును మాత్రమే పొలంలో నాటుకోవాలన్నారు. ఆమె వెంట ఉద్యాన అధికారి మాధవ్, నర్సరీ యజమానులు ప్రవీణ్, కుమారస్వామి ఉన్నారు.

అధ్వానంగా రోడ్డు

రాళ్లు తేలి ఉన్న రహదారి

మహదేవపూర్, మే 28 : మండల కేంద్రంలో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారి ధ్వంసమై అధ్వానంగా తయారైంది. వర్షానికి గుంతల్లో నీరు నిలువడంతో పాటు కంకర తేలడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతు లు, వాహనదారులు ఇబ్బందులకు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేసి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

ఏటూరునాగారం, మే 28 : మండలంలోని రామన్నగూడెం, ఏటూరునాగారంలోని మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఆదర్శ పాఠశాలల పనులను జిల్లా సమగ్ర శిక్షా అధికారులు హర్షం రాజు, సాంబయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల నాణ్యతను పరిశీలించారు. జూన్ 1లోగా పనులు పూర్తిచేయాలనిహెచ్ఎంలు, మండల సమాఖ్య వీవోలను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని సూచించారు. వారి వెంట సీర్‌పీలు శ్రీధర్ నాయక్, కే సత్యారావు, సీవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారం బరాజ్ వద్ద ట్రాఫిక్ జామ్

మూడు గంటల పాటు నిలిచిన వాహనాలు

కాళేశ్వరం, మే 28: మహదేవపూర్ మండలంలోని అన్నారం బరాజ్ వద్ద తరుచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. బరాజ్ వద్ద రెండు ఇసుక క్వారీలకు నిత్యం 500 వరకు లారీలు వస్తుంటాయి. రోడ్డుపైనే లారీలను నిలుపడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నది. కాగా, మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి అన్నారం గ్రామానికి వెళ్తున్న ఓ ప్రయాణికుడు విద్యాసాగర్ అతడి కుటుంబ సభ్యులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో రోడ్డుపైనే కారు ఆపి నిరసన వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆయనతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

గేదెలపై దూసుకెళ్లిన లారీ

రెండు గేదెలు మృతి, మరో రెండింటికి గాయాలు

మహదేవపూర్, మే 28 : లారీ బీభత్సంతో గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. లారీ డ్రైవర్ గేదెల గుంపుపై వేగంగా దూసుకెళ్లడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంతోనే గేదెలు మృతి చెందాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళ ల ఆరోగ్యంపై అవగాహన

ఏటూరునాగారం, మే 28 : మండలంలోని కొండాయిలో మంగళవారం స్త్రీ ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్య ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ ప్రణీత్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సరైన మోతాదులో ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న గోల్డ్ చైన్ అందజేత

గోవిందరావుపేట, మే28 : పొగొట్టుకున్న గోల్డ్ చైన్‌ను బాధితుడికి అప్పగించిన సంఘటన మండలంలోని పస్రా గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మేడారం గ్రామానికి చెందిన శిడెం లక్ష్మయ్య తన వద్ద ఉన్న రెండు తులాల బంగారు తాడును బ్యాంకులో పెట్టేందుకు పస్రాకు వచ్చాడు. బ్యాంకులో పని కాకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తాడును పోగొట్టుకున్నాడు. బాధితుడు లక్ష్మయ్య పస్రా ఎస్సై కమలాకర్‌ను సంప్రదించి విషయం తెలిపాడు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందితో కలిసి పస్రాలో అన్ని చోట్ల ఆరాతీయగా గ్రామానికి చెందిన ఎలిశాల ధనమ్మకు దొరికిందని తెలుసుకున్నారు. ఆమెను అడగగా తనకే దొరికిందని చెప్పడంతో ఎస్సై సమక్షంలో బాధితుడు లక్ష్మయ్యకు అందజేశారు.

ఇసుక లారీలను అడ్డుకున్న మహిళ లు

ఏటూరునాగారం, మే 28 : మండలకేంద్రంలోని సామాజిక వైద్యశాల మూల మలుపు నుంచి క్రాస్‌రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి వస్తున్న ఇసుక లారీలను స్థానికులు అడ్డుకున్నారు. కన్నాయిగూడెం మండలం సింగారం, ఏటూరు గ్రామాల పరిధిలో పట్టా భూముల్లో ఇసుక మేటల తొలగింపునకు క్వారీలు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి వచ్చే లారీలు క్రాస్‌రోడ్డులోని ఇండ్ల మధ్య నుంచి వస్తున్నాయి. కాగా, మంగళవారం సాయంత్రం స్థానికులు రోడ్డుకు అడ్డంగా కట్టెలు పెట్టి లారీలను నిలిపివేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడం, లారీల రాకపోకలతో లేస్తున్న దుమ్ముతో ఆహార పదార్థాలపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుపై ట్యాంకర్లతో నీటిని చల్లి దుమ్ము లేవకుండా చూడాలని మహిళలు కోరారు. లేకపోతే వేరే మార్గంలోకి లారీలను మళ్లించాలని మహిళలు డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

తాడ్వాయి, మే 28 : మేడారం మహా జాతర సందర్భంగా ఓ భక్తుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి బాధితుడికి అప్పగించారు. తల్లుల దర్శనానికి వచ్చిన భూపాలపల్లి పట్టణానికి చెందిన వెంకటేశ్వర్‌రావు సెల్ ఫోన్ పోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు సెల్‌ఫోన్ రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అప్పగించారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

మహదేవపూర్, మే 28 : తునికాకు సేకరణకు అడవికి వెళ్లిన ఓ వ్యక్తిపై అడవి పంది దాడి చేసింది. ఈ ఘటన మండలంలోని కుదురుపల్లిలో సమీపంలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చల్లా రాజయ్య అడవికి వెళ్లి తునికాకు సేకరిస్తుండగా అడవి పంది ఒక్కసారిగా దాడికి చేసి, తీవ్రంగా గాయపరించింది. గమనించిన స్థానికులు అతడిని మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

పీఏసీఎస్‌లో అవినీతిపై విచారణ చేపట్టాలి

మహదేవపూర్ (కాటారం), మే 28 : మండలంలోని పీఏసీఎస్ గారెపెల్లి (కె)లో గతంలో సుమారు రూ.50లక్షల అవినీతి జరిగిందని, దానిపై విచారణ జరిపించాలని రాష్ట్ర డీజీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డైరెక్టర్ కో ఆపరేషన్, రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ అధికారులకు చైర్మన్ తోటపల్లి ప్రశాంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మాజీ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి, సీఈవో ఎడ్ల సతీశ్, డైరెక్టర్ అయిలీ రాజబాపు మరికొందరితో కలిసి బినామీ పేర్లతో చెక్కులు డ్రా చేసి అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. అవినీతిలో కార్యాలయ రెండో అంతస్తు నిర్మాణం, సొసైటీ గోదాం, చైర్మన్ సొంత పనుల కోసం ఆతుకూరి ప్రవీణ్‌ను రోజువారీ కూలీకి తీసుకొని నెలకు రూ.9,500 ఇస్తూ రూ.3.50 లక్షల సొసైటీ నిధులు కొల్లగొట్టారని వెల్లడించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సమ్మక్క పూజారికి మాతృవియోగం

తాడ్వాయి, మే 28 : మేడారం సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన సమ్మయ్యకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి శతాధిక వృద్ధురాలు సిద్దబోయిన లక్ష్మి (104) సోమవారం రాత్రి మృతి చెందింది. సమ్మయ్య కుటుంబాన్ని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క,సారలమ్మ పూజారులతో పాటు వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు.

పాఠశాలా.. పశువుల పాకా ?

పాఠశాల ఆవరణలో ఉన్న పశువులు

ఏటూరునాగారం, మే 28 : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పశువులకు అడ్డాగా మారింది. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును నిర్మించిన సమయంలో పాఠశాల ప్రహరీని కూలగొట్టి వాహనాల రాకపోకలకు వినియోగించారు. పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో పాఠశాలలో పశువులు నివాసముంటున్నాయి. వరండాల్లో తిరుగుతూ పేడ వేస్తున్నాయి. గత ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.35 లక్షలకు పైగా కేటాయించింది. దీంతో షెడ్డు నిర్మాణం, పాఠశాలలో మరమ్మతులు చేపట్టి ఆధునీకరించారు. పాఠశాల ముందువైపు గేటుకు తాళం వేసి ఉండడంతో అవి బయటికి వెళ్లడం లేదు. పశువుల యజమానులు వాటిని తోలుకపోతే తప్ప కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి పాఠశాలకు వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు ప్రహరీ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కృష్ణ కాలనీ, మే 28: భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 31న జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ – 8, 10, 12, 14, 16, 18, 20 ఏండ్ల విభాగాల్లో బాలబాలికలకు, మహిళలు, పురుషులకు 50మీ, 150మీ, 100మీ, 400మీ, 800మీ, 1,500మీ, 5,000 మీటర్లలో పరుగు పందెం, అలాగే లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో పోటీల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన 30 మందిని జూన్ 6న హనుమకొండ జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 7 గంటల వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడామైదానంలో హాజరు కావాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

మహదేవపూర్ : విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి నర్సింగం

భూపాలపల్లి రూరల్/చిట్యాల (మొగుళ్లపల్లి)/మహదేవపూర్, మే 28 : నకిలీ విత్తనాలు విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. రైతులను మోసం చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని, విత్తనాలు నిల్వచేసినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ టీ కాటన్ విక్రయాలకు అనుమతి లేదని, కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు రసీదులు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే వ్యవసాయ, పోలీస్ అధికారులకు తెలుపాలని ఎస్పీ సూచించారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని విత్తనాల షాపులను జిల్లా అగ్రికల్చర్ అధికారితో కలిసి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేశ్‌కుమార్ తనిఖీ చేశారు. అమ్మిన విత్తనాలు, పురుగు మందులకు రసీదులు ఇవ్వాలని షాపుల యజమానులకు సూచించారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఎస్సై బోరగాల అశోక్ తనిఖీ చేశారు. నకిలీ విత్తనాల విషయంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని విత్తన షాపుల్లో ఏడీఏ శ్రీనివాస్‌రాజ్, ఏవో ప్రభావతితో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారి నర్సింగం తనిఖీలు చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఏ విధమైన ప్యాకింగ్ లేకుండా విత్తనాలు తక్కువ ధరకు విక్రయిస్తే రైతులు వాటిని తీసుకోవద్దని సూచించారు. అలా ఎవరైనా చేస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారివెంట ఏఈవోలు ధర్మేందర్, రచన తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు ఇస్తే సమాచారం ఇవ్వాలి

ములుగురూరల్, మే 28 : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను కట్టబెడితే తమకు సమాచారం ఇవ్వాలని ఏవో మునుకుంట్ల సంతోష్ అన్నారు. జగ్గన్నపేట, పులిగుండం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ లైసెన్స్‌లు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లు తప్పక తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపర్చుకోవాలని సూచించారు. అనంతరం మల్లంపల్లి, పత్తిపల్లి, ములుగు, అబ్బాపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్‌కు మొట్లపల్లి విద్యార్థుల ఎంపిక

చిట్యాల(మొగుళ్లపల్లి), మే 28: మండలంలోని మొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు గోనె రేష్మ, మహమ్మద్ ఆసిఫా తబుసం, మునిగాల స్టెయిన్స్ దినకరన్, నర్రాపుల రాకేశ్ ఎంపికయ్యారు. ఒక్కొక్కరికీ సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు స్కాలర్‌షిప్ అందనున్నట్లు హెచ్ఎం కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఉపాధ్యాయులు నర్సింహస్వామి, సంపత్‌కుమార్, వీరయ్య, ఉమారాణి, రాణ